# ★ ముహూర్త బలిమి ★

రచన: పురగా సీత

"అమ్మా బావని ప్రేమించాను. మా ఇద్దరి హృదయాలు కలిసినాయి, మాకు ఎడబాటు చేయకండి, అమ్మా! ఈ పెండ్లి చూపులు వద్దని చెప్పమ్మా" అని వసంత కన్నీరు మున్నీరుగా ఏడ్వడం చూచి తల్లి రాధమ్మ "ఊరుకో తల్లీ నాన్నగారు ఎవరి మాట వినరు. లేచి ముఖము కడుక్కొని బట్టలు మార్చుకో తల్లీ వాళ్ళు వచ్చే టైము అవుతోంది!" అంది. పెండ్లి చూపులు సవ్యంగా జరిగాయి. కాని కేశవరావుగారు, పిల్లవాడు నచ్చనీ, ఉద్యోగంలేదని ఆయనే మానుకున్నారు. ఇది మూడవ సంబంధం. భార్య కూతురు పోరు ఎట్లా వున్నదో సంబంధాలు కుదరక పోవడం అల్లాగే వున్నది అనుకుంటూ కండువా దులుపుకుని బజార్లోకి వెళ్ళిపోయారు. వసంత అంటే తల్లికి ప్రాణం. మనస్సులో మాట ఏదీ తల్లి దగ్గర దాచుకోలేదు వసంత. అందుకే తన మనస్సు సిగ్గు విడిచి చెప్పగలిగింది తల్లితో.

"అమ్మా! నీకు మామయ్యకు సమ్మతం అయినప్పుడు మధు బావకు నాకు పెండ్లి చేయకూడదూ!" మీకు డబ్బు ప్రధానమా? మనసులు కలవడం, హృదయాలు ఏకమవడం కావాలా?" అంటూ వసంత తల్లి ఒడిలో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

రాధమ్మ మాత్రం ఏమి చేస్తుంది? భర్త అంటే భయం. కేశవరావుగారు హడావిడిగా వచ్చి "ఏయ్.... నిన్నే ఎక్కడ చచ్చేవే? రామారావు "వైరు" ఇచ్చాడు. 'బెజవాడ' నించి ఎవర్నో 'పెండ్లివారిని తీసుకు వస్తున్నాడట, వసంతని త్వరగా తెమలమను."

"ఏమండీ........ మిమ్మల్నే........?

"ఊ, ఏమంటావూ? పెండ్లివారిని రావద్దు అంటావా?"

"అది కాదండీ? వసంతను మధుకు ఇచ్చి"......

"చీ నోర్ముయ్ పనిగాడి మాట నావద్ద తీసుకురాకు ఆస్తి, చదువులేనివారికి ఇవ్వను. వసంతా!.... త్వరగా తెములు. దీనికి, ఏ అడ్డు చెప్పినా నేను ఊరుకునే వాడిని గాదు"

పెండ్లికొడుకు, తండ్రి, మేనమామ. రామారావుగారు, వచ్చారు. పెండ్లికొడుకు రవి "ఇంజనీయర్" చేస్తున్నాడు. అతని వాటా ఆరు ఎకరాలు, స్వంత ఇల్లు వున్నది అందగాడు కాకపోయినా అనాకారికాడు. అన్ని మాటలు జరిగాయి. ఐదువేలు కట్నం. ముహూర్తం పెట్టారు. తెల్లారితే శుక్రవారం అనగా పెండ్లి వసంత బావని రమ్మని ఉత్తరం వ్రాసింది. లక్ష్మివారం సాయంత్రం దాకా చూచినది బావ రాలేదు. క్షణ క్షణం బావ కోసం ఎదురుచూచింది. ముహూర్తం 'నాలుగూ నలభై' నిమిషాలకు పురోహితుని మంత్రోచ్చరణతో వివాహవేదికంతా మారుమోగుతోంది. ముత్తైదువులు హడావిడిగా తిరుగుచున్నారు. పెండ్లి పెద్దలు ఆసీనులు అయ్యారు. పిల్లలు 'బేండు' వద్ద కూర్చొని గోల చేస్తున్నారు. రాధమ్మగారికి మాట లాడడానికి తీరక లేకుండా బ్రాహ్మణులకు అందివ్వడంతో, వచ్చిన చుట్టాలకు ఏమి కావాలో చూడడంతో సరిపోతున్నది. రాధమ్మ మేనత్త 'సుందరమ్మగారు హడావిడిగా వచ్చి "ఏమే రాధా వసంత గదిలో లేదు పురోహితుడు కంగారు చేస్తున్నాడు అంట. కమలా 'వసంత ఏదీ' అంటూ రాధమ్మ దొడ్లోకి దారితీసింది. వెనకే అంతా గుసగుసలు మొదలుపెట్టారు 'వసంతకు ఈ పెండ్లి ఇష్టంలేదుట' అంటూ వెంకాయమ్మగారు, 'బావని ప్రేమించిదిట' అంటూ సూరమ్మగారు, 'అయ్యో చోద్యమా? పెద్దలు కుదిర్చిన పెండ్లిగాని ఈ ప్రేమ లేమిటీ బాబూ' అంటూ బుగ్గలు నొక్కుకుంది రాధమ్మ పెద్ద అత్తగారు మంగమ్మగారు. వసంత స్నేహితురాలు కమల, గిరిజ అంతా చూచారు ఎక్కడ కనబడలేదు.

కేశవరావుగారు కేకలు వేస్తున్నారు. 'ఏమిటీ ఆలశ్యం ముహూర్తం దాటి పోతున్నది, రుక్మిణమ్మా? వసంత ఎక్కడ' అంటూ చెల్లెల్ని అడిగినారు. 'వసంత గౌరి పూజ పీటమీదనించి ఎక్కడకు వెళ్ళినది కనిపించలేదు అన్నయ్యా?' అంటూ తనూ దొడ్లోకి దారి తీసింది.

కేశవరావుగారి కోడలు సరస్వతి "కొంప మునిగింది అత్తయ్యా" మన వసంత వెనక దొడ్లో పాడుబడ్డ నూతిలో పడింది రండి అత్తయ్యా". అంతా దొడ్లోకి లైట్లు వేసుకుని పరుగెత్తారు. లగ్నం దాటింది అంటూ పురోహితుడు, వెనక పెండ్లికొడుకు, తండ్రి ఒకళ్ళ వెనుక ఒకరు దొడ్లోకి వచ్చారు. వసంతని పైకి తీశారు, ప్రాణమైతే ఇంకా పోలేదు. చేయవలసిన ప్రథమ చికిత్స చేశారు. కాని ప్రయోజనంలేక పోయింది. ముహూర్తం వేళకి సరిగ్గా నాలుగు నలభై నిమిషాలకి వసంత ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎక్కడనించి వచ్చాడో "వసంతా" అంటూ మధు వసంతమీద పడ్డాడు. ఇంకేముంది ఎవరి దారి వాళ్ళు చూచుకున్నారు "ముహూర్త బలిమి" దిట్టమైనది అన్నారు పెద్దలు.

---

## మీకు తెలుసా?

అణువులో అంతర్భాగం సూర్య కుటుంబమువలె ఉటుంది. మధ్య ఉన్న న్యూక్లియస్ తప్ప ఇంచుమించు అంతా శూన్యప్రదేశమే. నూరు పౌనులు బరువు గల మనిషిలో ఉన్న శూన్యప్రదేశమంతా తీసివేసి, న్యూక్లియస్ అన్నీ ముద్దగాచేస్తే, ఆముద్ద ఒక్క ధూళిరేణువుకంటె పెద్దగా ఉండదు. అదేవిధంగా. భూమిలో ఉన్న అణువులలో ఉన్న ఖాళీస్థలం అంతా తీసివేస్తే, మిగిలే పదార్థం, అరమైలు వ్యాసం గల మట్టిగోళంగా ఉంటుంది (భూమి వ్యాసం షుమారు 8000 మైళ్లు).